# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం | 16 ఏప్రిల్ , 2025 | పేజీలు :06


## తెలంగాణ జనసమితి జిల్లా కన్వీనర్‌గా మోరె గణేష్



**ప్రజాపక్షం/శంకరపట్నం:** తెలంగాణ జన సమితి కరీంనగర్ జిల్లా కన్వీనర్‌గా పార్టీ సీనియర్ నాయకుడు మోరె గణేష్ ఎన్నికైనట్లు టిజెఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం నియామకపు పత్రం జారీ చేశారు. తెలంగాణ జన సమితి రాష్ట్ర నాయకులు ముక్కెర రాజు ప్రధాన అనుచరుడు మోరె గణేష్ టిఎజెఎస్‌లో కార్యకర్త స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ యువజన సమితి జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా పలు బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహించారు. కరీంనగర్ జిల్లాలో అనేక స్వచ్చంద సేవా కార్యక్రమాలు నిర్వహించడం, పార్టీని బలోపేతం చేయడానికి అహర్నిషలు కృషి చేస్తున్న మోరె గణేష్ జిల్లా కన్వీనర్‌గా ఎన్నిక కావడం పట్ల టిజెఎస్ రాష్ట్ర నాయకులు ముక్కెర రాజు, సతీష్ రెడ్డి, స్రవంతి తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సంధర్బంగా జిల్లా కన్వీనర్ మోరె గణేష్ మాట్లాడుతూ తెలంగాణ జన సమితి పార్టీని కరీంనగర్ జిల్లాలో నిర్మాణాత్మకంగా గ్రామశాఖ నుంచి జిల్లా స్థాయి వరకు బలపరుస్తానని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రణాళిక బద్ధంగా పనిచేస్తానని పేర్కొన్నారు.



### ధాన్యం కొనుగోలు ప్రక్రియ

# వేగవంతం

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో యాసంగి పంట ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని మిని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి ధాన్యం కొనుగోలు పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడతూ యాసంగి మార్కెటింగ్ సీజన్ లో రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రతిపాదించిన 240 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు 119 ఐకెపి, 21 పాక్స్, 7మెప్మా, 1డిసిఎంఎస్ మొత్తం 148 కేంద్రాలను ఓపెన్ చేశామని అన్నారు. మరో రెండు రోజుల వ్యవధిలో మిగిలిన 92 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో డిఆర్డీవో శేషాద్రి, డిఏఓ అఫ్జలి బేగం, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, పౌర సరఫరాల శాఖ అధికారులు రజిత, వసంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### భూ భారతి చట్టంపై ప్రజలలో

# విస్తృత ప్రచారం



### కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** తెలంగాణ ప్రజలకు ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజా ప్రభుత్వం నూతనంగా తీసుకుని వచ్చిన భూ భారతి ఆర్వోఆర్ చట్టం పై విస్తృతంగా ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష భూ భారతి చట్టం అమలు పై అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం ప్రజావాణి దరఖాస్తులను ఇంకా నుంచి ప్రతి వారం స్క్రూటినీ చేయడం జరుగుతుందని, వాటి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. భూ భారతి చట్టం పై తహసిల్దారులు రెవెన్యూ అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. భూ భారతి చట్టం యొక్క గెజిట్, రూల్స్ ను రెవెన్యూ శాఖ లో ప్రతి అధికారి తెలుసుకోవాలని అన్నారు.భూ భారతి చట్టంలో రెండంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని అన్నారు. భూ పరిధి చట్టం ప్రకారం ఇకపై రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ చేసే సమయంలో సర్వే మ్యాప్ తప్పనిసరి అవుతుందని అన్నారు. ఏప్రిల్ 17 నుంచి ఏప్రిల్ 30 వరకు నూతన భూ భారతి ఆర్వోఆర్ చట్టం పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, దీనికి సంబంధించిన షెడ్యూలు, వెన్యూ లను తయారు చేసుకోవాలని అన్నారు .ప్రతి రోజు కనీసం 2 అవగాహన కార్యక్రమాలు జరగాలని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు , ఇతర ప్రజలు ఈ సమావేశాలకు హాజరయ్యేలా చూడాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. భూ భారతి చట్టం ముందస్తుగా రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద ప్రారంభించి, అక్కడ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటిని పరిష్కరించి

తరువాయి 2లో

### వేములవాడ హత్య కేసులో నిందితుల అరెస్ట్:రిమాండ్‌కు తరలింపు



**ప్రజాపక్షం/ వేములవాడ టౌన్:** వేములవాడ పట్టణంలోని శ్రీ నగర్ కాలనీకి చెందిన మృతుడు చెట్టిపెల్లి పరుశురాములు మరియు నిందితులైన బైరెడ్డి వినయ్, ఈర్ల సాయి, వస్తాద్ అఖిల్, నేదురి రాజేష్ మరియు అడ్డగట్ల మనోజ్ కుమార్ వీరందరూ గతంలో కలిసి తిరిగేవారని వీరందరి పైన గంజాయి, హత్య కేసులు మరియు వివిధ కేసులు వివిధ పోలీస్ స్టేషన్ల లో నమోదు కాగా చాలాసార్లు జైలుకు కూడా వెళ్లి వచ్చారు. గత కొంతకాలంగా మృతుడైన పరుశురాములు మిగతా ఐదుగురితో ఉండకుండా తన పని తాను చేసుకుంటూ ఇంటి వద్దనే ఉండగా, కొద్ది రోజుల క్రితం ఐదుగురు నిందితుల పైన వివిధ పోలీస్ స్టేషన్లలో గంజాయి కేసులు నమోదు కాగా, ఆట్టి గంజాయి కేసులు కావడానికి మృతుడైన పరుశురాములే కారణమని పోలీసులకు సమాచారం ఇస్తున్నాడనే అనుమానంతో ఎలాగైనా పరశురాములను చంపితేనే మాపై గంజాయి కేసులు కావని, సులువుగా గంజాయి వ్యాపారం చేయవచ్చునని, పోలీసులకు దొరకమని, తద్వారా వచ్చిన డబ్బులతో జల్సాలు చేయవచ్చని ఐదుగురు నిందితులు భావించి తేదీ 13.04.2025 రోజున ముందుగా వేసుకున్న పథకం ప్రకారం మృతుడు పరుశరాములు వేములవాడ రెండో బైపాస్ రోడ్డున గల మహా లింగేశ్వర ఫంక్షన్ హాల్ పక్కనగల స్టోర్ రూమ్ బిల్డింగ్ పైన ఒంటరిగా ఉండడం చూసి ఎలాగైనా చంపాలనే ఉద్దేశంతో తమ వెంట తెచ్చుకున్న గొడ్డల్లు, కత్తితో ముగ్గురు నిందితులు అయిన బైరెడ్డి వినయ్, ఈర్ల సాయి, వస్తాద్ అఖిల్ లు మృతున్ని విచక్షణారహితంగా దాడి చేసి చంపినారని మరో నిందితుడు రాజేష్ బయట ఎవరు రాకుండా గేటు వేసినాడని మరో నిందితుడు అయిన అడ్డగట్ల మనోజ్ కుమార్ వీరందరూ జైలుకు వెళ్తే బెయిల్ తీసుకురావడానికి తాను బయట ఉంటానని చెప్పి వీరందరినీ హత్య చేయడానికి పంపించినాడని మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ బి. వీర ప్రసాద్ కేసు నమోదు చేసి మంగళవారం రోజు ఉదయం 10.00 గంటలకు అయ్యోరు పల్లి గ్రామ శివారులో పట్టుకొని పంచనామా నిర్వహించి నిండుతుల నుండి పర్శురాములును చంపడానికి వాడిన రెండు గొడ్డళ్లను, ఒక కత్తిని, 2 బైక్ లను మరియు 2 సెల్ ఫోన్ లను స్వాదినపర్చుకున్నామని అన్నారు. పరారీలో ఉన్న నిందితుడు మనోజ్ కుమార్ కోసం గాలిస్తున్నామని వేములవాడ ఎస్పీ శేషాద్రిని రెడ్డి తెలిపినారు. వీరి వెంట సిఐలు బి వీర ప్రసాద్, శ్రీనివాస్, ఎస్ ఐ రమేష్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ఫారెస్ట్ కన్జర్వేషన్ చట్టం ప్రకారమే భూబదలాయింపులు

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :** జిల్లాలో అభివృద్ధి పనుల నిర్వహణలో అటవీ భూముల వినియోగానికి సంబంధించి ఫారెస్ట్ కన్జర్వేషన్ చట్టం మేరకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫారెస్ట్ కన్జర్వేషన చట్టంపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,అటవీ భూములపై చేపట్టే అభివృద్ధి పనులకు పరివేశ్ పోర్టల్ ద్వారా అనుమతులు పొందాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా స్థాయిలోనే మంజురు చేసి,అభివృద్ధి కార్యక్రమాలు ఆపకుండా కొనసాగేలా చూడాలని అటవీ అధికారులకు సూచించారు. అటవీ భూముల్లో రోడ్డు విద్యుత్ స్తంభాలు,ప్రాజెక్టులు,పంచాయ తీ భవనాలు తదితర నిర్మాణాల కోసం తప్పనిసరిగా పరివేశ్ పోర్టల్‌లో దరఖాస్తు చేయాలని తెలిపారు. ఒకవేళ ప్రతిపాదిత ప్రాజెక్టు టైగర్ రిజర్వ్ జోన్‌లో ఉంటే కేంద్ర రాష్ట్ర వైల్డ్ లైఫ్ అధికారుల అనుమతి కూడా తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు. జిల్లాలో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయడానికి అటవీ శాఖ రెవెన్యూ, విద్యుత్, ఇంజనీరింగ్ శాఖలతో సమన్వయంగా పని చేయాలన్నారు. పరివేశ్ పోర్డల్ గురించి అదికారులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ)కిషోర్ కుమార్,డీఎఫ్ఓ నాగినిబాను,ఆర్డీఓలు రత్న కళ్యాణి,కోమల్ రెడ్డి, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి,ఇరిగేషన్ శాఖల అధికారులు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.



# స్వీపర్లకు, స్కావెంజర్లకు వేతనాలు చెల్లించాలని కలెక్టర్‌కు వినతి

ప్రభుత్వ పాఠశాలల స్వీపర్స్ అండ్ స్కావెంజర్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్



**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** గత ఎనిమిది నెలల నుండి ప్రభుత్వ పాఠశాలల స్వీపర్లకు, స్కావెంజర్లకు జీతాలు రాక అప్పులు చేసి కుటుంబాలను పోషించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఎఐటియూసి అనుబంధ సంస్థల ప్రభుత్వ పాఠశాలల స్వీపర్స్ అండ్ స్కావెంజర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్ అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు మీసం లక్ష్మణ్ ఆద్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మీసం లక్ష్మణ్ ఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు మాట్లాడారు. తెలంగాణలోని అన్ని జిల్లాలో జీతాలు జమ చేయడం జరిగిందని కేవలం సిరిసిల్ల జిల్లాలోనే వేతనాలు చెల్లించడం లేదని వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా కాకుండా నేరుగా కార్మికుల ఖాతాలోనే జమ చేయాలని కోరారు. కార్మికులకు వచ్చిన డబ్బులు కార్మికులకే చెల్లించాలని ఇతర అవసరాలకు వాడొద్దని అన్నారు. కార్మికులకు చీపుర్లు, ఫినాయిల్, బ్లీచింగ్ పౌడర్, గ్లౌజులు, యూనిఫాం ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. ఇన్సురెన్స్ సౌకర్యం ఉద్యోగ భద్రత కల్పించి, రిటైర్మెంట్ బెనిఫిట్ నాలుగు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులను అక్రమంగా తొలగించరాదని, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, నర్సవ్వ, లత, నడిబొట్టు లక్ష్మి, లతా, మల్లేశం, దేవయ్య, రజిత, లావణ్య, ప్రమీల, ఇందిరా, జ్యోతి, తేజస్వినీ, రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి చట్టంపై ప్రజలలో విస్తృత ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)



జూన్ నెలలో పట్టాలు పంపిణీ చేసి రాష్ట్రవ్యాప్తంగా అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. మన పెద్దపల్లి జిల్లాలో భూ భారతి చట్టం అమలుకు అధికారులు సన్నద్ధం కావాలని, ప్రజల భూ సమస్యల పరిష్కారానికి పటిష్ట కార్యాచరణ రూపొందించాలని అన్నారు. ప్రస్తుతం మన వద్ద పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అన్నారు.ప్రభుత్వ భూముల ఫెన్సింగ్, మార్కింగ్ ప్రక్రియను తహసిల్దార్ లు పూర్తి చేయాలని అన్నారు. రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య, సురేష్, తహసిల్దార్ లు, సంబంధిత ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పొట్యాల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ జడ్పీటీసీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఠాకూర్ అయోధ్యసింగ్ మంగళవారం ప్రారంభించారు. ఏలాంటి కోతలు లేకుండా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నారని, దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచి ఎదులాపురం నీరజ వెంకటేష్, రామగుండం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ మడ్డి తిరుపతిగౌడ్, కాంగ్రెస్‌పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు బరుపటి శ్రీనివాస్, నాయకులు సంతోష్, నాగరాజు, కొత్తపల్లి రాజు, రమేష్, భాస్కర, నరేష్, టింకు అట్టల్, రమేష్, అశోక్, శ్రీను, శ్యామ్, నర్సయ్య, రైతులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లకు అండగా నిలిచింది కెసిఆరే

బిఆర్ఎస్ సభకు ఆటో డ్రైవర్ల రూ.50 వేల విరాళం



**ప్రజాపక్షం/గోదావరిఖని :** తెలంగాణ రాష్ట్రంలో ఆటో డ్రైవర్లను కడుపులో పెట్టుకొని కాపాడింది తొలి సీఎం కెసీఆర్ అని రాష్ట్రంలో మళ్లీ బిఆర్ఎస్ ప్రభుత్వం రావాలని వారు కోరుకుంటున్నట్లు రామగుండం మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. మంగళవారం గోదావరిఖనిలో స్థానిక ఆటో డ్రైవర్లు విరాళంగా సేకరించిన రూ.50 వేలను బిఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం కోరుకంటి చందర్‌కు అందజేశారు. బి.ఆర్.టి.యు. ఆటో యూనియన్ రాష్ట్ర కమిటీ వేముల మారయ్య ఆదేశాల మేరకు రామగుండం నగర ప్రాంత ఆటో యూనియన్ పరిధిలోని పలు అడ్డాల నాయకులు, సభ్యుల సహకారంతో విరాళంగా సేకరించిన రూ.50 వేలను ఈనెల 27న ఎల్కతుర్తిలో జరిగే కెసీఆర్ బహిరంగ సభ కోసం అందజేసినట్లు చందర్ తెలిపారు. ఈ సందర్భంగా చందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆటో డ్రైవర్ల ఆర్థిక పరిస్థితి ఆగం అయిందన్నారు. కెసీఆర్ పాలనలో సకల వర్గాల ప్రజలు సంతోషంగా జీవించారన్నారు. రామగుండం ప్రాంతంలోని ఆటో డ్రైవర్లు అందరూ బిఆర్ఎస్ సభకు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీలారపు రవి, రేణిగుంట్ల సురేష్, ఆయుధాల సదానందం, పసుపుల విజయ్‌కుమార్, మాతంగి సురేష్, కనుకుంట్ల రాజేందర్, రమేష్, నారమల్ల అనిల్ నేతగాని శ్రీనివాస్, అన్నారపు నరేందర్, రాచర్ల రవీందర్‌లు పాల్గొన్నారు.

## కావేరీ చైతన్య సీడ్స్ కంపెనీ హమాలీ గదుల తనిఖీ



**ప్రజాపక్షం/శంకరపట్నం:**అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు శంకరపట్నం మండల పరిధిలోని మొలంగూర్ శివారులో గల చైతన్య కావేరీ సీడ్స్ కంపెనీలో పనిచేస్తున్న హమాలీ కార్మికుల గదులను హుజురాబాద్ రూరల్ సిఐ పులి వెంకట్, కేశవపట్నం ఎస్ఐ కొత్తపల్లి రవితో కలిసి పరిశీలించారు. నార్కోటిక్ డాగ్ స్వార్డ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి హమాలీలుగా పనిచేస్తున్న కార్మికులు గంజాయి, డ్రగ్స్, మాదకద్రవ్యాలు ఇతర కార్యకలాపాలు చేస్తున్నారనే సమాచారం మేరకు వారి ఆధార్ కార్డులు పరిశీలించి వేలిముద్రలను సేకరించినట్లు పేర్కొన్నారు. అసాంఘిక కార్యక్రమాలు చేపట్టినట్లైతే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సుధాకర్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వాహనదారులకు పొంచి ఉన్న ప్రమాదం



**ప్రజాపక్షం / ముస్తాబాద్ :** ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది గ్రామంలో ఎల్లమ్మ గుడికి వెళ్లే మూలమలుపు వద్ద వానాకాలంలో కురిసిన వర్షాలకు వరద నీరు కాలువ నుండి ప్రవహించడంతో ఏర్పడిన గుంతలు ప్రమాదభరితంగా మారాయి. ఈ గుంతలను ఆర్అండ్‌బి అధికారులు కాంట్రాక్టర్ సహాయంతో పూడ్చివేసే ప్రక్రియ చేపట్టకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు రాత్రివేళలో ఏ మాత్రం ఏమరుపాటుగా ప్రయాణించిన గుంతలలోపడి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. మండలంలోని వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా అంతే సంగతి అన్నట్లుగా రోడ్డు పరిస్థితి ఉన్నది. వాహనాలు కాలువలో పడి వాహనదారులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉన్నందున ఇప్పటికైనా ఆర్అండ్‌బి అధికారులు స్పందించి ప్రమాదంగా ఉన్న ఈ గుంతలను కాంట్రాక్టర్ సహాయంతో మట్టి నింపి తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టాలని స్థానిక ప్రజలు, వివిధ గ్రామాల వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

# రాజీవ్ యువ వికాసం దరఖాస్తు గడువు పొడగించాలి

సిఎం, డిప్యూటీ సిఎంలకు ట్విట్టర్ ద్వారా వినతి



**ప్రజాపక్షం/గోదావరిఖని :** తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగుల ఉపాధి కోసం ఆర్థిక సహాయం అందించేందుకు తీసుకువచ్చిన రాజీవ్ యువ వికాస్ పథకం ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పించే గడువు సోమవారం ముగియడంతో నిరుద్యోగ యువత ఆందోళనకు గురవుతున్నట్లు, దరఖాస్తు గడువును ఈనెలాఖరు వరకు పొడగించాలని కోరుతూ ట్విట్టర్ ద్వారా సీఎం, డిప్యూటి సీఎంలను కోరినట్లు ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అర్హులైన 5 లక్షల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించడంతో నిరుద్యోగుల్లో సంతోషం నెలకొందన్నారు. అయితే దరఖాస్తు సందర్భంగా పలుమార్లు సర్వర్ పనిచేయకపోవడం, ఇతర పలు సమస్యలు తలెత్తడంతో చాలా వరకు నిరుద్యోగులు సకాలంలో దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా సమర్పించలేకపోయారన్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లో నిరుద్యోగులను సిబ్బంది ఇబ్బంది పెట్టకుండా, ఏలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చూడటంతోపాటు దరఖాస్తు గడువును ఈనెలాఖరు వరకు పొడగించాలని కోరినట్లు దినేష్ తెలిపారు.

## పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

ఎస్‌పి మహేష్ బి గీతే



**ప్రజాపక్షం / ముస్తాబాద్ :** ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ మహేష్ బి గీతే మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రిసెప్షన్‌ను సందర్శించి సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల వివరాలను ఆరా తీసి త్వరగా పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులతో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. పాత నేరస్తులు, రౌడీ షీటర్లపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే చోట కారణాలు గుర్తించి, ప్రమాదాలు చోటు చేసుకోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదే విధంగా స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎస్పీ వెంట డిఎస్పీ చంద్రశేఖర్ రావు, సిఐలు మొగిలి శ్రీనివాస్, ఎస్సై గణేష్ సిబ్బంది ఉన్నారు.

# మైనార్టీ కార్పొరేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** క్రైస్తవ సోదరులందరు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను వినియోగించుకోవాలని క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ చైర్మన్ దీపక్‌జాన్ అన్నారు. మంగళవారం కల్వరి బాపిస్టు చర్చిలో మాట్లాడారు, క్రైస్తవ సోదరులు దేశం కోసం,శాంతిని చేకూర్చుకోవాలని ప్రార్థించాలని కోరారు. అలాగే రాష్ట ప్రభుత్వం ఏటా పదివేల మంది పైచిలుకు రుణాలు అందిస్తున్నదని అన్నారు. చదువులో పాటుగా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఫాస్టర్ గౌరవధ్యక్షులు రాజేష్ అధ్యర్యంలో సాదరణ సమావేశమయ్యారు.నతానియోల్, హిజ్కియా, దేవనందం,ఏసుదాసు ఉండగా గంబీరావ్‌పేట, వీర్నపల్లి, ముస్తాబాద్ ప్రాంతాల ఫాస్టర్లు పాల్గొన్నారు.



# వడదెబ్బ పట్ల కార్మికులు అప్రమత్తం

హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి



ప్రజాపక్షం/జమ్మికుంట: వేసవి ఎండల తీవ్రతలకు ఉష్ణోగ్రతలు పెరగడంతో కార్మికులు వడదెబ్బకు గురయ్యే అవకాశముందని, కావున కార్మికులు అప్రమత్తంగా ఉండాలని వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి సూచించారు. జమ్మికుంట మండలం వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పట్టణంలోని ఇటుక బట్టీలలో పనిచేసే కార్మికులకు వడదెబ్బపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఇటుకబట్టి కార్మికులకు వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎండవేడిమికి డీ హైడ్రేషన్ కోసం ఓఆర్ఎస్ ద్రావణాన్ని త్రాగాలని సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను వారికి పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ అరుణ, ఏఎన్ఎం రజిత, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఆశాదీమాసుల్తానా తదితరులున్నారు.

## ప్రభుత్వం చిత్ర కళాకారులను ఆదుకోవాలి



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : చిత్ర కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఆర్థికంగా ఆదుకోవాలని పెద్దపల్లి జిల్లా ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా మాజీ అధ్యక్షుడు చిప్పకుర్తి సత్యనారాయణ కోరారు. ప్రపంచ చిత్రకళా దినోత్సవ సందర్భంగా జిల్లా కేంద్రంలో మంగళవారం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. చిత్రకళాకారుల సమస్యలను కార్మిక సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి తమ సమస్యలను పరిష్కరించాలని సత్యనారాయణ కోరారు. కార్యక్రమంలో సీనియర్ కళాకారులు మల్లెబోయిన మోహన్, ఆరెపల్లి దేవరాజ్, కొత్తూరి మోహన్, మాతంగి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని గృహిణి బలవన్మరణం



ప్రజాపక్షం/ గోదావరిఖని : గోదావరిఖని సెవెన్ ఎల్ఈపీ కాలనీకి చెందిన సాజిదా అనే మహిళ ఇంటిలో చీరెతో ఉరి వేసుకొని మంగళవారం బలవన్మరణానికి పాల్పడింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఆత్మహత్య చేసుకున్నది. కుటుంబసభ్యుల మధ్య తలెత్తిన వివాదం కారణంగా సాజిదా ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. సాజిదాకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. గోదావరిఖని ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## అగ్నిప్రమాద నియంత్రణ చర్యలపై అవగాహన

ఎస్ఎఫ్ఒ నరేందర్



ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు ఎస్ఎఫ్ఓ నరేందర్ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ హైస్కూల్, సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, రేడియంట్ ఇంగ్లీష్‌మీడియం స్కూల్, శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్, భారతి విద్యా నిలయం, శ్రీ చైతన్య స్కూల్ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేసి, అగ్ని ప్రమాద నివారణ నియంత్రణ చర్యల గురించి అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలయ చైర్మన్ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం



ప్రజాపక్షం / ధర్మపురి : జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మి నృసింహస్వామి ఆలయ చైర్మన్ జక్కు రవీందర్ పద్మ దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. చైర్మన్ జక్కు రవీందర్ స్వగృహంలో లోక కళ్యాణార్థం నిర్వహించిన హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమంలో స్వామివారి చిత్రపటాలను ఏర్పాటు చేసి వేదపండితులు సంగనబట్ల నరేందర్ శర్మ ఆధ్వర్యంలో అభిషేకం, అష్టోత్తర నామ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా చక్రతీర్థం



ప్రజాపక్షం/ఇల్లందకుంట: అపర అయోధ్య ఇల్లందకుంట శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం పుష్పయాగం (నాఖబలి) కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు వంశీధరాచార్యులు పూజ కార్యక్రమాలను చేపట్టారు. ఉదయం 11 గంటలకు నవకలశ స్నపన చక్రస్నానం, చక్రతీర్థం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులు పల్లకిలో కోనేరు వద్దకు తీసుకెళ్లి అమృత చక్రస్నానం నిర్వహించిన అనంతరం శంకదార చక్రదర సహస్రదార చేయించి రాత్రి 9 గంటలకు పుష్పయాగం నాఖబలి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కందుల సుధాకర్, ఆలయ చైర్మన్ ఇంగిలె రామారావు, ఆలయ ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పాలకుర్తిలో కాంగ్రెస్ జై సంవిధాన్ ర్యాలీ



ప్రజాపక్షం/పాలకుర్తి : పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కన్నాలలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు బోడగుట్టపల్లె నుంచి కన్నాల వరకు ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని సమ్మయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య, కన్నాల మాజీ సర్పంచి లాలొసింగ్, పాలకుర్తి మండల యూత్ వైస్ ప్రెసిడెంట్ దండుగుల శ్రీకాంత్, కన్నాల అధ్యక్షులు భూతగడ్డల రమేష్, మాజీ ఉప సర్పంచి బదావత్ జ్యోతి శంకర్ నాయక్, నాయకులు శ్రీశైలం, బాలగొని కుమార్‌గౌడ్, సంపంగి నర్సింహులు, రెడ్డపాక వసంత, మల్లేష్, బదుగు మహేందర్, పయ్యాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



ప్రజాపక్షం / ధర్మపురి : అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో మంగళవారం అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది స్మారకార్థం దేశవ్యాప్తంగా ఏప్రిల్ 14నుండి 20 వరకు అగ్ని మాపక వారోత్సవాలు నిర్వహిస్తుండగా ఎస్ఎఫ్ఓ సిహెచ్. శ్రీకాంత్ ఆధ్వర్యంలో సిబ్బంది ధర్మపురి బస్ స్టాండ్‌లో అగ్నిప్రమాద నివారణకై తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ అవగాహన కల్పించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో అగ్నిమాపక విన్యాసాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎఫ్ఓ కే. ప్రవీణ్ రావు, డిఓపి వి. రత్నాకర్, ఫైర్ మెన్స్ బి. శ్రీనివాస్, ఏ. రాకేష్, వి. రాజేంద్ర ప్రసాద్, జి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

## లేబర్ చట్టాల రద్దుకు పోరాటాలను తీవ్రం చేద్దాం



ప్రజాపక్షం/గోదావరిఖని : కార్మిక వర్గాన్ని కట్టు బానిసత్వానికి గురిచేసే లక్ష్యంతో ఆర్.ఎస్.ఎస్., బిజెపి ప్రభుత్వం తెచ్చిన లేబర్ చట్టాల రద్దుకై పోరాటాల్ని తీవ్రం చేద్దామని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, స్కీమ్స్ వర్కర్ల క్రమబద్ధీకరణకు ఉద్యమిద్దామని ఐ.ఎఫ్.టి.యు. జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం గోదావరిఖనిలోని ఐఎఫ్‌టియు కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 77 ఏళ్ల తర్వాత కూడ దేశంలో కార్మిక వర్గానికి ఉద్యోగ భద్రత లేదన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో పర్మినెంట్ కార్మికులకు బదులుగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను నియమిస్తూ శ్రమ, ఆర్థిక దోపిడికి పాల్పడుతున్నారన్నరు. 90 శాతం అసంఘటిత రంగ కార్మికులకు చట్ట బద్ధమైన హక్కులు, సౌకర్యాలు లేవన్నారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఐ.కృష్ణ, ఎం.శ్రీనివాస్, జిల్లా నాయకులు వెంకన్న, ఈ.నరేష్, బి.అశోక్, చిలుక శంకర్, ఈ.రామకృష్ణ, ఐ.రాజేశం, గుండేటి మల్లేషం, కొంగ్ర మొగిలి, ఎల్ల రవికుమార్, బి.బుచ్చయ్య, బి.కొమురయ్యలు పాల్గొన్నారు.

## రామగుండంలో శ్రీరామ పట్టాభిషేకం

ప్రజాపక్షం/రామగుండం : శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా రామగుండం పట్టణంలోని శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయంలో శ్రీరాముడి పట్టాభిషేకం కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీసీతారామచంద్రస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. అర్చన్యాసం అనంతరం అయోధ్యలో జరిగిన శ్రీరాముడి పట్టాభిషేకం, రామరాజ్యంలో ధర్మ పాలన ఏవిధంగా కొనసాగింది, రామావతారం పరమార్థాన్ని భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాపక్షం/బెజ్జంకి: రైతులు వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలల్లో విక్రయించి కనీస మద్దతు ధరను పొందాలని ఫాక్స్ చైర్మెన్ తన్నీరు శరత్ రావు,ఏఎంసీ చైర్మెన్ పులి కృష్ణలు అన్నారు.మంగళవారం మండల పరిధిలోని వడ్లూర్,గూడెం గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళారులను నమ్మి మోసపోకుండా రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పులి సంతోష్ గౌడ్,అన్నాడి రవిందర్ రెడ్డి,నరేష్ బాబు,గూడెల్లి లక్ష్మణ్,మచ్చ కుమార్,మాజీ ఏఎంసీ చైర్మెన్ దేవ శ్రీనివాస్ రెడ్డి,కాసాని నర్సయ్య,రాసూరి మల్లికార్జున్,పులి రమేష్,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం

ప్రజాపక్షం/పాలకుర్తి : పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలోని బోడగుట్టపల్లి, నక్కిరెడ్డిపల్లి, కొత్తపల్లి, రబ్జీకాలనీ(కన్నాల) గ్రామాల్లో శ్రీలక్ష్మి (మహాలక్ష్మి), భూలక్ష్మి, (గ్రామశిల(బొడ్రాయి) గ్రామ దేవత విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం కార్యక్రమాన్ని ఈనెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గ్రామదేవతల ప్రతిష్ఠ పోచమ్మ కొలుపు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం బసంత్‌నగర్ ఎస్.ఐ. స్వామిని కలిసి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం కార్యక్రమానికి రావాల్సిందిగా ఆహ్వానించినట్లు వారు తెలిపారు.

## అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

**ప్రజాపక్షం/నిజామాబాద్‌ప్రతినిధి;**అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారి నర్సింగ్‌రావు అన్నారు. జిల్లా అగ్నిమాపక అధికారి నర్సింగ్‌రావు సిబ్బందితో కలిసి రాష్ట్ర విపత్తు స్పందన అగ్నిమాపక సేవల శాఖ వారి ఆధ్వర్యంలో 1420 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం రైల్వే స్టేషన్‌లో రైల్వే ఎస్సై సాయిరెడ్డి చేతుల మీదుగా పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఏమాత్రం ఆందోళన చెందకుండా వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారమందించాలన్నారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. ఎండాకాలంలో ఎక్కువగా అగ్నిప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆ సమయంలో చాకచక్యంగా ఆలోచిస్తూ ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా కాపాడవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై మొగులయ్య, ఎఎస్సై ఖాన్, రైల్వే పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం

**ప్రజాపక్షం/మోర్తాడ్;**పార్లమెంట్‌లో డా.బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అవమానిస్తూ మరో పక్క అంబేద్కర్ విగ్రహ శుద్ధి పేరుతో బిజెపి నాయకులు అంబేద్కర్ విగ్రహాలను తాకినందుకు నిరసనగా నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో మంగళవారం మోర్తాడ్ మండల కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ మైపాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఎడపల్లిలో యువకుల రక్తదాన శిబిరం

**ప్రజాపక్షం/ఎడపల్లి:**తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం ఎడపల్లి మండల కేంద్రంలో యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ మేరకు రెడ్ క్రాస్ ఉద్యోగి నవీన్ గౌడ్ జన్మదినం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ వారి ఆధ్వర్యంలో బుధవారం బ్లడ్ డోనేషన్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ క్యాంప్ కు స్థానిక యువకులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. యువకులంతా కలిసి మొత్తంగా 50యూనిట్ల బ్లడ్ డోనేట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రమాద బారిన పడిన వారికి, అత్యవసర సమయంలో ఆపదలో ఆదుకునేందుకు రక్తం ఎంతో అవసరమని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమున్న వారికి రక్తదానం చేయడం ప్రాణదానం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా ఛైర్మన్ బుస్సా ఆంజనేయులు, రెడ్ క్రాస్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తోట రాజ శేఖర్, రెడ్ క్రాస్ మండల ఛైర్మన్ మల్లెపూల శ్రీనివాస్, సోసైటీ ఛైర్మన్ పోలా మల్కారెడ్డి, కాంగ్రెస్ విలేజ్ అధ్యక్షులు బంజ కామప్ప పటేల్, బీజేపీ అసెంబ్లీ ఇన్‌ఛార్జి కూరెళ్ల శ్రీధర్, కాంగ్రెస్ యూత్ మండల ప్రెసిడెంట్ రంజిత్, రెడ్ క్రాస్ ల్యాబ్ టెక్నీషియన్, జాగృతి అసెంబ్లీ కన్వీనర్ న్యావనంది శ్రీకాంత్, కందునూరి నవీన్ గౌడ్, రెడ్ క్రాస్ సిబ్బంది, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# అసలు సిసలైన తెలంగాణ ఉద్యమ నేత ఇకలేరు



**ప్రజాపక్షం /ఆర్మూర్:** తెలంగాణ రాష్ట్ర ఉద్యమ ప్రక్రియ లో కుంట గంగామోహన్ రెడ్డి (65) ఆయన ఒక కీలకమైన వ్యక్తి, తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న తరుణంలో ఆయన ఒక దిక్సూచి. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌తో కలిసి ఉద్యమంలో పనిచేసిన వ్యక్తి, నిజామాబాద్ జిల్లా అంతటా ఆ వ్యక్తి తెలియని వారంటూ లేరు.తెలంగాణ రాష్ట్రం కోసం అంబాసిడర్ కారుకు పూర్తిగా గులాబి రంగువేసి తెలంగాణ ఉద్యమంలో గ్రామ గ్రామానికి ఆ కారులో ప్రచారం చేశారు. ఆర్మూర్ ప్రాంత ప్రజలకు ఆయన ఒక సుపరిచితుడు. ఆయనంటే అందరికి అభిమానం. ప్రతి ఒక్కరితో మర్యాదతో కలిసి మెలిసి ఉండేవారు. చిన్న పెద్ద తేడా లేకుండా అందరితో కలుపుగోలుగా ఉండే ఆయన ఇకలేరు అనే సంఘటనను ఆర్మూర్ ప్రాంత ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆయన రాష్ట్రం కోసం చేసిన త్యాగం మర్చిపోలేనిది, అకాల మరణంతో ఆర్మూర్ ప్రాంతమంతా శోకతప్త హృదయాలతో నిండిపోయింది. ఎలాంటి ఆర్థిక వనరులను కూడబెట్టుకోకుండానే ఆయన జీవితం అర్థాంతరంగా ముగిసిపోయింది. శనివారం బట్టలు పిండుకోవడానికి గుండ్ల చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృతి చెందినట్టు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. దహన సంస్కరణ కార్యక్రమంలో గోవింద్‌పేట్ ఆనంద్‌రెడ్డి, కోటపాటి నరసింహనాయుడు, మిట్టపల్లి గంగారెడ్డి, అంకాపూర్ నడికుడ బూమారెడ్డి, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాల వేలం పాట

### ఎక్సైజ్ సిఐ వి. రవి



**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :**కాగజ్ నగర్ పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌లో అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సిఐ వి. రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్ నగర్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో ఈ నెల 17న గురువారం ఉదయం 11 గంటలకు జిల్లా ఎక్సైజ్ అధికారి బి. జ్యోతి సమక్షంలో వాహనాల వేలం పాట జరగనుందని పేర్కొన్నారు. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను వేలం ద్వారా అమ్మకానికి ఉంచుతున్నామని, ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనవచ్చని, పూర్తి వివరాల కోసం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు

## 21వ తేదీ వరకు పాఠశాలల భౌతిక వివరాలు సమర్పించాలి

### మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్



**ప్రజాపక్షం/ కాగజ్ నగర్ :**పాఠశాలల భౌతిక వివరాలను పరిశీలించి ఈ నెల 21వ తేదీ వరకు నివేదికలు సమర్పించాల్సిందిగా ఉపాధ్యాయులతో పాటు క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లకు సూచించినట్టు మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ తెలిపారు. కాగజ్ నగర్ మండలంలో మంగళవారం యుడైస్ ప్లస్ పై థర్డ్ పార్టీగా బి. ఇడ్ కాలేజీ ఆసిఫాబాద్ ట్రైనీ టీచర్లతో కలిసి చేపట్టిన సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఎంపిక చేసిన 94 పాఠశాలలను తొమ్మిది రూట్లుగా విభజించి, ప్రతి రూట్‌కు ఒక ట్రైనీ ఉపాధ్యాయుడు, ఒక క్లస్టర్ రిసోర్స్ పర్సన్ కలిపి బృందాలుగా ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ అబీద్ అలీ మాట్లాడుతూ గతంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు యుడైస్ ప్లస్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పాఠశాల వివరాలను భౌతికంగా పరిశీలించాక, ఏవైనా పొరపాట్లు కనిపిస్తే వెంటనే సరిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిసిఒ మహేష్, ఐఆర్‌పిలు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

## అధికారంలో ఏపార్టీ ఉంటే ఆపార్టీలోకి దూకడమే పోచారం నైజం

### తిమ్మాపూర్ వెంకన్న సాక్షిగా పోచారం అబద్ధాలు ఆడారు

### మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

**ప్రజాపక్షం /బాన్సువాడ :**రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి చేరి పదవులు అనుభవించడమే ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి నైజమని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మంగళవారం బాన్సువాడ పట్టణంలోని భారత్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన రజతోత్సవ మహాసభ సన్నాహక సమావేశానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో హాజరై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. కష్ట కాలంలో పార్టీకి అండగా ఉండే వారికే తాము మొదటి ప్రాధాన్యత ఇస్తామని, పార్టీలో చేరేవారికి రెండవ ప్రాధాన్యత ఇస్తామన్నారు. పార్టీకి కార్యకర్తలే బలం, బలగమని, క్షేత్రస్థాయిలో పార్టీని తమ భుజ స్కందాలపై నడిపించే కార్యకర్తలే పార్టీకి శ్రేయస్కరమన్నారు.

**నటనలో పోచారం నటసామ్రాట్ మించిపోయారు...**

బాన్సువాడ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి నియోజకవర్గ ప్రజల ముందు నట సామ్రాట్‌ని మించిపోయారని బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కృషితోనే వేల కోట్ల నిధులతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సమక్షంలో తిమ్మాపూర్ వెంకన్న సాక్షిగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తాను బతికున్నంత కాలం కెసిఆర్ వెన్నంటి ఉంటానని చెప్పిన మాటలు ప్రజలందరికి జీవితాంతం గుర్తుండిపోతుందన్నారు. ఎంపి ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిపాలన నచ్చి మెచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరానని చెప్పి ప్రజలను మోసగించిన శ్రీనివాస్ రెడ్డికి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తారన్నారు. పార్టీ మారాలనుకుంటే బిఆర్‌ఎస్ పార్టీ నుండి గెలిచిన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వెళ్ళుంటే బాగుండేదన్నారు. నియోజకవర్గంలో మంజీర ఇసుక, గుట్టలు, క్రషర్లు తన కమీషన్ల కోసమే పార్టీలో చేరిన సంగతి నియోజకవర్గ ప్రజలందరికి తెలుసన్నారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి పదవిలో ఉండే అర్హత లేదన్నారు.

**భవిష్యత్తు బిఆర్‌ఎస్ పార్టీదే...** రాష్ట్రంలో ఏ ఎన్నిక వచ్చినా ఎగిరేది గులాబీ జెండానని భవిష్యత్తు బిఆర్‌ఎస్ పార్టీదేనని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. నియోజకవర్గంలో పోచారం కుటుంబ సభ్యులు బెదిరిస్తే భయపడేది లేదని కార్యకర్తలకు అండగా తాము ఉంటామని, అక్రమ కేసులు బనాయిస్తే పోలీసులు, అధికారులు, అధికార పార్టీ నాయకుల పేర్లు పింక్ బుక్కులో రాసుకుంటామని, అధికారంలోకి వచ్చిన తర్వాత బదిలీపై ఎక్కడికి వెళ్లినా అదే అధికారి చేత కేసులు చేయిస్తామన్నారు. ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే పార్టీ రజతోత్సవ మహాసభకు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు గులాబి పార్టీలోకి చేరగా వారికి ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ మునిసిపల్‌వైస్‌ఛైర్మన్,నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మలిదశ ఉద్యమకారుడు దండు విజయ్‌కి ఎమ్మెల్సీ కవిత పరామర్శ



**ప్రజాపక్షం / బాన్సువాడ:**బాన్సువాడ పట్టణంలో మలిదశ ఉద్యమకారుడు, జర్నలిస్టు దండు విజయ్ కుమార్ ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో మంగళవారం బారాస నాయకులు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, ఆశన్నగారి జీవన్‌రెడ్డి వారి నివాసానికి వెళ్ళి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత విజయ్ ఆరోగ్య పరిస్తితిని అడిగి తెలుసుకుని వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని అధైర్య పడవద్దన్నారు. కార్యక్రమంలో మాజీ మునిసిపల్ వైస్ ఛైర్మన్ షేక్ జుబేర్, ఉడుత గంగాధర్ గుప్తా, చందు, గంగారాం, భాస్కర్‌గౌడ్, ఎర్రవాటి సాయి బాబా, తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ నాయక్‌పోడ్ గ్రామ కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/ఆర్మూర్ :**మండలంలోని చేపూర్ గ్రామంలో మంగళవారం ఆదివాసీ నాయక్‌పోడ్ సేవా సంఘం అధ్యక్షుడిగా మీనుగు రంజిత్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో గ్రామంలో భీమన్నగుడిని అందరి సహకారంతో నిర్మిస్తామని, ఆదివాసులకి వచ్చే అన్ని ప్రభుత్వ పథకాలను అమలయ్యే విదంగా చూస్తానని ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి సహకరించిన కుల పెద్దలకు అందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఆదివాసీ నాయక్‌పోడ్ ఉద్యోగుల సేవా సంఘం ప్రధాన కార్యదర్శి కోసెడుగు రవి, నాయకపోడు మండల ప్రధాన కార్యదర్శి మేడిపల్లి గౌతం, చేపూర్ గ్రామ అభివృద్ధి కమిటి మాజీ అధ్యక్షుడు మేడిపల్లి శ్రీకాంత్, మీనుగు రవిశంకర్, నాయకులు మీనుగు నాగరాజ్, మేడిపల్లి సాగర్, మాజీ ఆదివాసి నాయకపోడు అధ్యక్షుడు మేడిపల్లి గిరీష్, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మోర్తాడ్‌లో పోషణ పక్షోత్సవాలు



**ప్రజాపక్షం/మోర్తాడ్:**నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని బాలికల హాస్టల్ లో మంగళవారం పోషణ పక్షోత్సవాన్ని నిర్వహించారు. కిశోర బాలికలకు 1118 ఆడ పిల్లలకు రక్త పరీక్షలు నిర్వహించామని అంగన్‌వాడీ టీచర్ జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ.. ఈ వయస్సులో ఎలా ఉండాలి..? పరిశుభ్రత పై వారికి అవగాహన కల్పించామన్నారు. అదేవిధంగా 18ఏళ్లు దాటిన తరువాతనే పెళ్లి చేసుకోవాలని, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వారికి వివరించామని టీచర్ జ్యోతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి రిషిక్, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, ఘన శారద, సుజాత, రాజేశ్వరి, సులోచన, స్వర్ణలత, అంజమ్మ, వార్డెన్ సుమలత, ఆశ కార్యకర్త రేఖ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి సింగరేణి ఏర్పాట్లు

**ప్రజాపక్షం/మందమర్రి:**సింగరేణి ఆధ్వర్యంలో మందమర్రి ప్రాంత ప్రజల ఆరోగ్య సంక్షేమం కోసం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ నెల 17వ తేదీ ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 6:00 గంటల వరకు శిబిరం సిఇఆర్ క్లబ్‌లో ఏర్పాటు కానుంది. శిబిరం మాతారీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద, హైదరాబాద్‌కి చెందిన ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో నిర్వహించబడనుంది. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు, గతంలో ఈ శిబిరానికి హాజరైనవారు, కొత్తగా వైద్యం పొందదలచినవారు తప్పకుండా హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం..

**ప్రజాపక్షం/సోన్:**మండలంలోనికడ్తాల్ గ్రామ శివారులోని సరస్వతి కాలువ ప్రక్కన గల రోడ్డు వద్ద సోమవారం గుర్తు తెలియని మగ వ్యక్తి(5560) మృతదేహం కనిపించిందని,తల వెంట్రుకలు పొడవుగా పెరిగి తెలుపు నలుపు గడ్డం కలిగి బట్టలు మాసిపోయి ఉన్నాయని,చూడ్డానికి మతిస్థిమితం లేని వ్యక్తిలా కనిపిస్తున్నాడని,కడ్తాల్ మాజీ సర్పంచ్ బర్మా గంగా నర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోన్ ఎస్ఐ గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## యూనియన్ బ్యాంక్ ఉద్యోగస్తుల బృందానికి సన్మానం

**ప్రజాపక్షం/బైంసా:**బైంసాటౌన్‌లోని కమ ల జిన్నింగ్ ఫ్యాక్టరీలో నారాయణ్ రావు పటేల్ నివాసంలో బైంసా యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ అభినవ్ వికాస్ బదిలీపైవారణాసికి వెళ్తున్న సందర్భంగా వారి స్థానంలలో నిజాంబాద్ అర్పిక్ దినేష్ సత్తార్ మేనేజర్‌గా ప్రమోషన్ చెందినందుకు వారికి కమల ఇండస్ట్రీ మేనేజింగ్ డైరెక్టర్ నారాయణరావు పటేల్ వారిని సన్మానంచడం జరిగింది.మంచి సేవలతో ప్రజలక అన్ని విధలుగా అందు బాటులో ఉంటూ ఇలాగే ముందు కొనసాగుతూ ప్రజలకు సేవ చేయాలని వారికి ధన్యవాదాలు తెలియజేశారు.

## సోన్‌వాసి కుటుంబాన్ని ఆదుకోవాలని ఎస్‌పికి వినతి..

**ప్రజాపక్షం/సోన్ :**దుబాయ్‌లో హత్యకు గురైనటువంటి ప్రేమ్ సాగర్ కుటుంబాన్ని ఆదుకోవాలని ఎస్‌పికి మంగళవారం సోన్ రజక సంఘ నాయకులు వినతి పత్రాన్ని సమర్పించారు.సోన్ గ్రామానికి చెందిన అష్టా ప్రేమ్ సాగర్ కుటుంబ పోషణ బ్రతుకుదెరువు నిమిత్తం దుబాయికి దాదాపు 6సం.. రాల క్రితం వెళ్లినారు.దుబాయిలోని ప్రముఖ బేకరీ కంపెనీలో పనిచేస్తున్నాడు.శుక్రవారం ఎప్రిల్ 11వ తేదీన పాకిస్తాన్ కు చెందిన అదే కంపెనీలో పని చేస్తున్న ముస్లిం యువకుడు తల్వార్ తో ప్రేమసాగర్‌ను ముస్లిం మతానికి అనువైన నినాదాలు చేస్తు హతమార్చినాడు,ప్రభుత్వం సమగ్రవిచారణ జరిపి బాధిత కుటుంబాన్ని ఆదుకొని,ప్రేమ సాగర్ మృతదేహాన్ని స్వస్థలానికి తెప్పించగలరని గ్రామస్తులు వేడుకొన్నారు.

# కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా మే 20న సమ్మె




**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :**కేంద్రం ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను వెంటనే విరమించుకోకపోతే దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కేంద్ర కార్మిక సంఘాల జెఎసి నాయకులు హెచ్చరించారు. మంగళవారం ఆసిఫాబాద్‌లోని ఎస్‌టియు భవనంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు టి దివాకర్ అధ్యక్షతన జెఎసి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 20వ తేదీన కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా జరగనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ కార్మికుల హక్కులను కాలరాశేదిగా ఉన్న నూతన లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో త్యాగాలతో కార్మికులు సాధించుకున్న 44 చట్టాలను యధావిధిగా అమలు చేయాలని కోరారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలను కూడా పూర్తిగా రద్దు చేయాలని కోరుతూ మోడీ పాలనకు ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని, మోడీ ప్రభుత్వ పతనం ప్రారంభమైందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు అల్లూరి లోకేష్, టియుసిఐ జిల్లా కార్యదర్శి గోంగల్ల తిరుపతి, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, ఆర్‌టిసి రిటైర్డ్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు , నాయకుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల పెరుగుదలపై ప్రత్యేక దృష్టి



**ప్రజాపక్షం/జైపూర్ :**పసిపిల్లల ఆరోగ్యంపై మక్కువతో తల్లిదండ్రులు చురుకుగా భాగస్వామ్యం కావాలని అంగన్‌వాడి సూపర్వైజర్ కవిత అన్నారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశాల మేరకు జైపూర్ మండలంలోని దుబ్బపల్లి గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రంలో మంగళవారం 0 నుంచి 6 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లల బరువు, ఎత్తు, ఆరోగ్య పరిస్థితులపై పర్యవేక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల పెరుగుదల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారి వెంకట్రావుపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి తిరుమల హాజరై, తల్లిదండ్రులకు సలహాలు, సూచనలు అందించారు. పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, వయస్సుకు తగ్గట్లుగా బరువు, ఎత్తు ఉండేలా పోషకాహారం అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. బరువు తక్కువగా ఉన్న చిన్నారులను గుర్తించి, తల్లులకు పోషణపై అవగాహన కల్పించారు. అనంతరం పోషణ పక్షం సందర్భంగా ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ జి. శ్యామల, సూపర్వైజర్ కవిత, ప్రత్యేక అధికారి తిరుమల తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌ను అవమానించింది బిజెపి నాయకులు: మోహన్‌రెడ్డి



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** అంబేద్కర్ ఆశయాలను తుంగలో తొక్కి రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం బిజె పి చ,ఏస్తుందని పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను అవమానించిందిబిజెపి నాయకులని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు లు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. అంబేద్కర్ విగ్రహాన్ని వారి పాపపు చేతులతో తాకినందుకు గాను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పూలాంగ్ చౌరస్తాలో అంబేద్క ర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి శుద్ధి చేశారు. ప్రపంచ మే ధావి అంబేద్కర్ అని, అమిత్‌షాపై ఎందుకు చర్యలు తీసుకోలేదని దీంతో బిజెపి కి అంబేద్కర్‌పై చిత్తశుద్ధి లేదని అర్థమవుతుందన్నారు. హత్య చేసిన వారే సానుభూతి తెలిపిన ట్లు రాష్ట్రస్థాయిలో బిజెపి నాయకులు అంబేద్కర్ విగ్రహాలు శుద్ధి చేశారని ఈ విషయంలో బిజెపినాయకులకు అంబేద్కర్ విగ్రహాలను తాకినందుకు బిజెపి నాయకులు పాపపు చేతులతో అంబేద్కర్ విగ్రహాలను తాకినందుకు అంబేద్కర్ విగ్రహం శుద్ధి చేశామన్నారు.బిజెపి అంబేద్కర్‌ను తక్కువ చేసి చూపే ప్రయత్నాని తిప్పి కొడుతామని జై బాపు జై భీం జై సంవిధాన్ కార్యక్రమాన్ని గ్రామగ్రామాన ముందుకు తీసుకెళుతూ అంబేద్కర్ ఆశయాలను ప్రతిఒక్కరికి చేరువయ్యేలా చేస్తామన్నారు. మోడీ ప్రధానిగా అంబేద్కర్‌కు నివాళులర్పించలేదో చెప్పాలని రాజ్యాంగాన్ని అవమానిస్తున్న బిజెపి నాయకుల తీరును ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తాహెర్‌బిన్ హందాన్, కేశ వేణు పాల్గొన్నారు.

# విడిసి చర్యలు రాజ్యాంగానికి విరుద్ధం

### బిఎస్‌పి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :**విడిసి చర్యలు రాజ్యాంగానికి విరుద్ధమని బిఎస్‌పి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్ అన్నారు. ఏర్గట్ల మండలంలోని తాళ్లరాంపూర్‌లో గీత కార్మిక కుటుంబాలపై స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు వారి వృత్తిని అడ్డుకోవడం, మహిళలను ఆలయాల్లోకి రానివ్వకపోవటం చాలా దుర్మార్గమని విడిసిల పేరుతో కొంతమంది రాజ్యానికి విరుద్ధంగా కక్ష్య సాధింపు చర్యలు పాల్పడుతున్నారనిబిఎస్‌పిపార్టీ రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్ మండిపడ్డారు. మండలంలోని తాళ్లరాంపూర్‌లో స్థానిక గౌడ సంఘం సంఘ భవనంలో సోమవారం రాత్రి నిర్వహించిన బాధిత గీత కార్మికుల సమావేశంలో అన్యాయంపై గౌడ సంఘం మహిళలకు జరిగిన అవమానంపై వివరణ తెలుసుకున్నారు. అంబేద్కర్ బహుజనుల కోసం రాజ్యాంగం రాసి వారు జీవించటానికి హక్కులను రాసారని కానీ ఆర్మూర్ డివిజన్‌లోని గ్రామాల్లో విడిసిల పేరిట వృత్తిదారుల హక్కులపై దాడులు నిర్వహిస్తున్నారని, వృత్తి పనులు చేసుకుని సాగిస్తున్న వారి జీవితాన్ని అడ్డుకుంటున్నారని సమంజసం కాదన్నారు. గ్రామంలో విడిసిలు రద్దు అయ్యేంత వరకు తమ లీగల్ టీమ్‌లతో పోరాటం చేస్తామన్నారు. అంతేగాకుండా సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లివిడిసిలు రద్దు చేయాలని పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు బిఎస్‌పి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అభివృద్ధికి బిఆర్ఎస్ చేసిన కృషి మరువలేదనిది




**ప్రజాపక్షం/ మందమర్రి :**ఈనెల 27న వరంగల్ ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ విజయవంతం కావాలని కోరుతూ మండల స్థాయిలో బిఆర్ఎస్ నాయకులు ప్రచారం ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మందమర్రి పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు ప్రచారాన్ని వేగవంతం చేశారు. పట్టణంలో ఛలో వరంగల్ పిలుపుతో వాల్ రైటింగ్ కార్యక్రమాన్ని బట్టు రాజ్ కుమార్, తోట సురేందర్, ఎండి ముస్తఫా, బెల్లం అశోక్, సాగర్‌లు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ ఆదేశాల మేరకు ప్రతి శాఖా, విభాగాల నేతలు కార్యచరణను అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి బిఆర్ఎస్ చేసిన కృషిని ప్రజలకు వివరించే లక్ష్యంతో ప్రతి కార్యకర్త పనిచేస్తుండటం గర్వ కారణమని పేర్కొన్నారు. వరంగల్ సభలో తెలంగాణ ఆవిర్భావానికి నాంది అయిన ఉద్యమ చరిత్రను, బిఆర్ఎస్ ప్రస్థానాన్ని ముఖ్య నాయకులు ప్రజల ముందు ఉంచనున్నారని తెలిపారు.

## పేదలకు అండగా సిఎంఆర్ఎఫ్...

### ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి..



**ప్రజాపక్షం/కుంటాల :**నిరుపేద వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముధోల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జి.విఠల్ రెడ్డి అన్నారు.మంగళవారం కుంటాల మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన 17 మంది లబ్ధిదారులకు రూ.6 లక్షల 50వేల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్స్ చెక్కులను ముధోల్ మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తుందన్నారు.లక్షలు ఖర్చు చేసి ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోలేని వారికి సీఎంఆర్ఎఫ్ పథకం కొండంత అండగా ఉంటుందని తెలిపారు.పేదలకు సీఎంఆర్ఎఫ్ పథకం వరం లాంటిదని,సీఎంఆర్ఎఫ్ పథకాన్ని అర్హులైన పేదలు ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఫ్యాక్స్ చైర్మన్ సట్ల గజ్జరాం,ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జెడ్పీచైర్మన్ జుట్టు అశోక్,మాజీ ఫ్యాక్స్ చైర్మన్ లక్ష్మ ణ్,తాజ మాజీ సర్పంచ్ ధోనికెని సమత వెంకటేష్,నాయకులు కొత్తపెల్లి బుచ్చన్న,జుట్టు మహేంధర్,తాటి మహేష్,సబ్బిడి రాకేష్,గజేంధర్,భోగ లక్ష్మ ణ్,ప్రజాప్రతినిధులు,నాయకులు,కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## 'చలో వరంగల్'పోస్టర్ ఆవిష్కరణ...



**ప్రజాపక్షం/నేరడిగొండ :**బిఆర్ఎస్ పార్టీ ఈనెల 27న వరంగల్ ల్లో తలపెట్టిన రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్,పార్టీ నూతన సంవత్సర క్యాలెండర్ ని మంగళవారం ఆయన నివాసంలో పార్టీ కార్యకర్తల సమక్షంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతీ కార్యకర్త వరంగాల్ సభకు కంకణం కట్టుకొని రావాలని ఆది నాయకుడి ప్రసంగాన్ని వినాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శివారెడ్డి,మాజీ ఎంపిపి రాథోడ్ సజన్,బిఆర్ఎస్ ఆయా మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక అధికారులు ఎందుకని ప్రశ్నిస్తున్న ప్రజలు..

## పంచాయతీలలో ప్రత్యేక అధికారుల మార్పు ఎక్కడ కనిపించడం లేదని..?




**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** సర్పంచుల పదవీకాలం గత జనవరి 30 తేదీన ముగించడంతో గ్రామపంచాయతీ పాలన వ్యవహారాలు చక్కబట్టేందుకు ప్రత్యేక అధికారులు తెరపైకి తెచ్చి మూడు నుంచి నాలుగు గ్రామ పంచాయతలకు ఒక ప్రత్యేక అధికారలను నియమించిన విషయం అందరికీ తెలిసిందే అయి ఎతే సర్పంచులు పోయిన తర్వాత ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో ఎలాంటి వివక్షత లేకుండా గ్రామాల అభివృద్ధి బాట పడతాయని అందరూ భావించారు,నిర్మల్,దిలావర్పూర్,సోన్,మమడ,నర్సాపూర్ జి,బైంసా,ముథోల్ మండలాల్లో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్టుగా గ్రామాలలో అభివృద్ధిలో ప్రజా సమస్యల పరిష్కారంలో పంచాయతీల ప్రత్యేక అధికారుల మార్పు ఎక్కడ కనిపించడం లేదని గ్రామాలలోకి వారు సరిగా వచ్చి లేదు,వచ్చినవారు పెద్దగా చేసేదేమిలేదుని ప్రజల నుంచి తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి.కనీసం గ్రామాలపై అవగాహన లేని అధికారులకు అభివృద్ధి సాధ్యమేనా ఒకపక్క మండల స్థాయిలో బిజీగా ఉంటున్న గ్రామ పాలనపై కనీసం అవగాహన లేని వివిధ హోదాలతోఉన్న అధికారులను మండల అధికారులుగా నియమించడం వల్ల సమస్యలతో సతమతం అవుతున్నాయన్నారు.గ్రామాలకు పూర్తిగా పాలన పూర్తిగా నశించిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.ఏమైనా ఉంటే గ్రామపంచాయతీ కార్యదర్శి కి చెప్పండి గ్రామాలలోని ఏదైనా సమస్యలు ఉంటే ప్రత్యేక అధికారికి చెప్పాలని ప్రజలు అనుకున్న ఫలితంలేకుండా పోతుందని ఏది అడిగినా గ్రామ పంచాయతీ కార్యదర్శి చెప్పండి,అని సమాధానం వస్తుందని కార్యదర్శి అని నడిపిస్తున్నారని ఏమాత్రం ప్రత్యేక అధికారులు ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ప్రజలు మాకెందుకు ఈ కర్మ అంటున్నట్లుగా మండల స్థాయి అధికారులకు ప్రత్యేక అధికారులుగా నియమించడం తో వారు అసలు పనిపై దృష్టి పెట్టలేక గ్రామ సమస్యల పై అవగాహన చేయలేక పని వారంతో ఇబ్బందుదుతున్న మాకెందుకు ఈ కర్మ అంటున్నట్లుగా అధికారులు ఎవరికీ చెప్పకోలేక లోలోన మదన పడుతున్నారని వినికిడి అంతా కొంత సర్పంచ్ బెటర్ ఏదైనా గ్రామం నుంచి పూర్తి అవగాహన కలిగిన వ్యక్తి,ఏదే ఏమైనా గ్రామలు అభివృద్ధి చెందాలంటే గ్రామ వాసైన సర్పంచ్ అయి ఉండాలి.అప్పుడే సమస్యల పరిష్కరం అవుతున్నాయి.కావున మండల ప్రత్యేక అధికారుల వల్ల మాకు పెద్ద అభివృద్ధి చేసిందేమీ లేదు ఎంతో కొంత సర్పంచులు బెటర్ అంటున దిలావర్‌పూర్ మండల ప్రజలు గ్రామాల్లో సర్పంచ్ లేక అస్సవస్తంగా మారినా పరిపాలన గ్రామ ప్రజలు ఎవరికి చెప్పుకోవాలి అర్థం కాక,ఇబ్బంది పడుతున్న గ్రామ ప్రజలు,గ్రామాలకి సర్పంచులు లేక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతున్నదని ఇలానే ఎలక్షన్లు రాకుండా ఉండి సర్పంచ్ ఎలక్షన్లు రాకుంటే రానున్న రోజుల్లో ఇంకా అభివృద్ధికి ఆమడ దూరంలో వెళ్లే పరిస్థితి ఉందని ప్రజల ఆరోపిస్తున్నారు.గ్రామాలలో ఎవరికి ఏ సమస్య వచ్చినా ఇందకుముందు సర్పంచులు ఉండేవారు,ఇప్పటికైనా ప్రభుత్వం గ్రామ సర్పంచ్ ఎన్నికలను నియమించాలని కోరుకుంటున్న మండల,గ్రామల ప్రజలు,కార్యదర్శుల పరిస్థితి కార్యదర్శులను గ్రామ ప్రజలు ప్రశ్నిస్తే,కార్యదర్శుల సమాధానం టాక్టర్లకు డీజిల్ లేక చెత్త చెదరం తీయలేక ఇబ్బంది పడుతున్నారు.మేము పై నుంచి నిధులు రావట్లేదు అంటున్న గ్రామ సెక్రటరీలు,గ్రామాలలో అభివృద్ధికి సంబంధించినవి ప్రజలు అభివృద్ధి చేయట్లేదు గ్రామ ప్రజలు అడుగుతే వారికి సమాధానం పంచాయతీ కార్యదర్శులకు నిధులు లేవు మేము చేసేది ఏమీలేదని చేతులు దులుపుకుంటున్న సెక్రటరీలు,అభివృద్ధికి ఆమడ దూరంలో గ్రామపంచాయతీల పరిస్థితి..

## కెజిబివిలో 'పోలీస్ అక్క'కార్యక్రమంపై సమీక్ష:ఎస్‌పి డా.జి.జానకి షర్మిల



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** నిర్మల్ జిల్లా లోని 18 పాఠశాలలకు 18 మంది మహిళా కానిస్టేబుల్ లను పర్యవేక్షణ అధికారులుగా నియమించి ఒక్కో పాఠశాలలను ఒక్కో మహిళ కానిస్టేబుల్ నీ నియమించి వారంలో ఒక రోజు అట్టి స్కూల్ పిల్లలతో గడపాలని చేపట్టిన ప్రోగ్రాం మీద ఈ రోజు జిల్లా పోలీస్ ప్రధాన కార్యలయంలో ఎస్‌పి డా.జి.జానకి షర్మిల ఐపిఎస్ ఆన్లైన్ లో అందరితో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ వారి వద్ద నుండి సమాచారాన్ని సేకరించి తదుపరి దిశానిర్దేశం చేశారు.స్కూల్ లో విద్యార్థిని లతో కలసి ఉండి రాత్రి వారితో బస చేయటం వల్ల వారికి దగ్గరవుతారు తద్వారా వారి సాధక బాధకాలు పంచుకోవచ్చు.తల్లి దండ్రులకు దూరంగా ఉంటూ ఉంటారు.కాబట్టి విద్యార్థిని లకు ఎన్నో సమస్యలు ఉంటాయి,వాటిని వినటం వల్లనే సగం బారం తగ్గుతుందని తెలియజేసారు.వారిని మానసికంగా ఉత్తేజపరచాలని తదుపరి చదువుల నిమిత్తం సలహాలు ఇవ్వాలని తెలిపారు.భవిష్యత్తు లో మంచి ఉద్యోగం సంపాదించాగలం ఎలా చదవాలి అనేది వారికి ఇప్పటి నుండే అలవాటు చేయాలన్నారు.ఉదయమే మానసిక ఉల్లాసం కోసం శారీరకంగా ఉత్తజం కోసం యోగా కూడా చేయించాలన్నారు.గత కొన్ని వారాలుగా ఈ ప్రోగ్రాం లో చురుగ్గా పనిచేస్తున్న వారిని ప్రశంసించారు.ఈ మీటింగ్ లో అవినాష్ కుమార్,ఐపిఎస్,రాజేష్ మీన ఐపిఎస్,ఇన్స్పెక్టర్లు అజయ్,నైలు,గోపినాథ్,మల్లేష్,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాకు మంత్రి జూపల్లి



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** ఎక్సైజ్, పర్యాటక శాఖ, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జిల్లా కలెక్టరేట్‌లో పలు అంశాల మీద సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రైవేట్ సెక్రటరీ కాసుల సనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరి 10 గంటల 30 నిమిషాలకు జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుంటారని అనంతరం 10.45 కు వ్యవసాయం, సివిల్ సప్లయి మార్కెటింగ్, హెల్త్ వివిధ విభాగాలలో సమీక్షా సమావేశం ఉంటుందని తెలిపారు. అనంతరం ఆర్మూర్ నియోజకవర్గంలో బాల్కొండ నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు.

## ఎడపల్లి మండలంలో ఎమ్మెల్యే పర్యటన

**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నేడు శంకుస్థాపన చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ సబ్ ప్లాన్ కింద 1.70కోట్ల సీఆర్ఆర్ నిధులు మంజూరు చేశారని, ఇందులో భాగంగా జాన్కంపేట్, ఎడపల్లి గ్రామాల్లో పనులు చేపట్టనున్నారని దీనికి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

## బోనాల పండగ

**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పెద్దమ్మ తల్లికి బోనాలను సమర్పించారు. గ్రామ శివారులోని పెద్దమ్మ ఆలయంలో మహిళలు, సంఘ సభ్యులు పూజలు నిర్వహించారు. గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు మొక్కుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని డప్పు చప్పుల మధ్య ఊరేగింపుగా గ్రామ శివారులలో గల పెద్దమ్మ దేవత మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముదిరాజ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ప్రతిఏటా ఏప్రిల్ నెలలో పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల మార్కింగ్‌ప్రక్రియ త్వరిత గతిన పూర్తి

### అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి:** ఇందిరమ్మ ఇండ్ల మార్కింగ్ (ముగ్గు వేసే ప్రక్రియ)ప్రక్రియను త్వరిత గతిన పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు.మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల మార్కింగ్ ప్రక్రియపై సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు.జిల్లాలో ఇప్పటి వరకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు పూర్తి చేసిన మార్కింగ్ కు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ,ఇందిరమ్మ ఇండ్ల మార్కింగ్ ప్రక్రియను త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.హౌసింగ్ శాఖ ఎఇమంజూరైన ఇందిరమ్మ ఇండ్లకు మార్కింగ్ ప్రక్రియను దగ్గరుండి చేయించాలన్నారు.ఈ సమావేశంలో జెడ్పి సీఈవో గోవింద్,పిడి హౌసింగ్ రాజేశ్వర్,వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపిడివోలు,తదితరులు పాల్గొన్నారు.

## వివాదాస్పదంగా మారిన ఫ్లెక్సీ తొలగింపు



**ప్రజాపక్షం/ఎడపల్లి:** ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవం పెద్దమ్మ తల్లి బోనాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించడం పట్ల వివాదస్పదంగా మారింది. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామంలోని ప్రధాన కూడలిలో ముదిరాజ్ కులస్తులు ఏర్పాటు చేసిన పెద్దమ్మ తల్లి బోనాల ఫ్లెక్సీని స్థానిక పంచాయతీ సిబ్బంది తొలగించారు. దీంతో ముదిరాజ్ కుల సంఘ సభ్యులు యువకులు పెద్ద ఎత్తున గ్రామ పంచాయతీ వద్దకు వెళ్లి సిబ్బందిని నిలదీశారు. గ్రామ పంచాయతీ ముందు నిరసన చేపట్టారు. సమాచారం అందుకున్న పంచాయతీ కార్యదర్శి ప్రేమ్‌దాస్ అక్కడికి చేరుకొని సిబ్బంది తప్పిదం వల్ల ఫ్లెక్సీ తొలగించడం జరిగిందని నూతన ఫ్లెక్సీని తయారు చేయించి ఆ స్థలంలో ఏర్పాటు చేస్తామని హామీనివ్వడంతో గొడవ సద్దుమణిగింది.

## మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చే దిశగా చర్యలు..

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** సోన్ మండల కేంద్రానికి చెందిన ఆష్టం ప్రేమ్ సాగర్ దుబాయ్‌లో మృతి చెందడంతో,కుటుంబ సభ్యులు,మండల నాయకులు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి విన్నవించుకోగా,నేడు విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారులతో రాష్ట్ర ప్రభుత్వ ఎన్ఆర్ఐ సెల్ అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా ప్రేమ్ సాగర్ మృతదేహం స్వదేశానికి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అధికారులకు సూచించారు.మృతికి గల కారణాలు అడిగి తెలుసుకొని వారి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ,కుంటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి..



**ప్రజాపక్షం/ దిలావర్ పూర్ :** నిర్మల్ జిల్లా బైంసా ,నిర్మల్ జాతీయ రహదారి పై సిర్గాపూర్ శివారులోని గుర్తుతెలియని వాహనం ఢీకొని డిడోలి రాజు అనే వ్యక్తి 45 అక్కడికక్కడే మృతి చెందనట్లు దిలావర్పూర్ ఎస్ఐ లోకం సందీప్ తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం మహారాష్ట్రలోని హిమాయత్ నగర్‌కు చెందిన వారు రాంపూర్ గ్రామంలో నివాసముంటు మేస్త్రి పని చేసే వారని,నిర్మల్ కు వెళ్లి తిరిగి రాగా సిర్గాపూర్ శివార్ ప్రాంతం బైంసా వైపు బైక్ పై వస్తున్న ఇద్దరు మేస్త్రీలను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృది చెందగా మరొకరికి తీవ్ర గాయాలయని తెలిపారు.అక్కడకు చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.